సాక్షి
జగిత్యాల
బుధవారం । 6 । సెప్టెంబర్ । 2023

లలిత సహస్ర పారాయణం

ధర్మపురి: శ్రావణమాసం మంగళవారం సందర్భంగా పట్టణంలో భక్తిశ్రద్ధలతో లలిత సహస్ర పారాయణం నిర్వహించారు. స్థానికులు మురికి భాగ్యలక్ష్మి– శ్రీనివాస్ దంపతుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఆర్యవైశ్య మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని పట్టు వస్త్రాలు, ఆభరణాలతో అలంకరించారు.



న్యూస్‌రీల్

ఎస్సారెస్పీ గేట్లు ఎత్తివేత



గోదావరిలోకి దూకుతున్న వరద

జగిత్యాలఅగ్రికల్చర్: మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో ఎస్సారెస్పీ నిండుకుండలా మారింది. దీంతో మంగళవారం సాయంత్రం 16 గేట్లు ఎత్తి 49,920 క్యూసెక్కులను గోదావరి నదిలోకి వదిలారు. ఎగువ ప్రాంతాల నుంచి ప్రాజెక్టులోకి 64,038 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,091.00 అడుగులు కాగా, ప్రస్తుతం 1,091.00 అడుగులు ఉంది. పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 90.313 టీఎంసీలు కాగా అదేస్థాయి నీటినిల్వలు ఉన్నాయి.

మళ్లీ గుడిసెలు వేసే యత్నం



మాట్లాడుతున్న సీఐ ఆరీఫ్ అలీఖాన్

జగిత్యాలరూరల్: తిమ్మాపూర్ శివారులోని ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేయించేందుకు సీపీఎం నాయకులు కొందరు పేదలను కొంతకాలంగా తీసుకొస్తున్నారు. ఆ స్థలంలో గుడిసెలు వేసేందుకు యత్నిస్తున్నారు. రెవెన్యూ అధికారులు, ఆ గ్రామస్తులు అడ్డుకుంటున్నారు. ఈవిషయంలో ఇప్పటికే సీపీఎం నాయకులు, మరి కొందరిపై పోలీసులు ఇప్పటికే కేసులు నమోదు చేశారు. మంగళవారం మళ్లీ గుడిసెలు వేసేందుకు యత్నించగా తిమ్మాపూర్ గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో రెండువర్గాల మధ్య ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న రూరల్ సీఐ ఆరీఫ్‌అలీఖాన్ సంఘటన స్థలానికి చేరుకుని ఇరువర్గాలకు నచ్చజెప్పి అక్కడి నుంచి పంపించి వేశారు. సీపీఎం నాయకులు, పేద మహిళలు స్థానిక ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీగా తరలివచ్చి అక్కడ ధర్నా చేశారు.

ఆర్డీవో కార్యాలంలో వినతి

జగిత్యాల: కాగా, 12రోజులుగా ఆందోళనచేస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఎంబీసీ, మైనార్టీ పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఇళ్ల స్థలాల పోరాట వేదిక నాయకులు ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న నాయకులు

జగిత్యాల: అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సునీత కోరారు. మంగళవారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఉద్యోగుల జిల్లాస్థాయి విస్తృత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సమస్యలను పరిష్కరించకుంటే ఈనెల 11న నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. నాయకులు జ్యోతి, రజిత, వనిత, మాధవి, రాజలింగు, చౌదరి తదితరులు పాల్గొన్నారు.

పురస్కారం అందుకున్న ఉపాధ్యాయులు



పురస్కారం అందుకుంటున్న వెంకటరాజం

రాయికల్(జగిత్యాల): రాష్ట్రస్థాయి పురస్కారాలకు ఎంపికైన జిల్లాకు చెందిన ప్రధానోపాయుడు, ఉపాధ్యాయుడు మంగళవారం హైదరాబాద్‌లో అవార్డులు అందుకున్నారు. రాయికల్ మండలం మారావుపల్లి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు కడకుంట్ల అభయ్‌రాజ్ విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, హోంశాఖ మంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్సీలు రఘోత్తంరెడ్డి, సురభి వాణి నుంచి అవార్డు అందుకున్నారు. ఆయనను డీఈవో జగన్మోహన్‌రెడ్డి, ఎంఈవో గంగాధర్ అభినందించారు. కాగా, జిల్లాలోని కోరుట్ల మండలం పైడిమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అంబటి వెంకటరాజం మంత్రుల నుంచి ఉత్తమ హెచ్‌ఎం అవార్డు అందుకున్నారు.



అవార్డు అందుకుంటున్న అభయ్‌రాజ్

సింహం, ఏనుగులే ప్రత్యామ్నాయం!



- రాబోయే ఎన్నికలపై ఏఐఎఫ్‌బీ, బీఎస్పీ గంపెడాశలు
- మళ్లీ సత్తా చాటేందుకు ఏఐఎఫ్‌బీ ఉత్సాహం
- స్థానిక సంస్థల్లో సింహం గుర్తుపై 24 మంది విజయం
- 2018లో రామగుండంలో ఎమ్మెల్యే సీటు కైవసం
- ఉమ్మడి జిల్లాలో బోణీ కొట్టేందుకు బీఎస్పీ ఆరాటం
- రెండుపార్టీలతో టచ్‌లో ఉంటున్న అసంతృప్తులు
- బీజేపీ, కాంగ్రెస్ జాబితాల తర్వాత మరికొంత మంది వస్తారని అంచనా



సాక్షిప్రతినిధి, కరీంనగర్: రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల వేడి మొదలైంది. గులాబీ పార్టీ ఇప్పటికే తన అభ్యర్థులను ప్రకటించగా, కాంగ్రెస్ జాబితాపై కసరత్తు ప్రారంభించింది. బీజేపీ కూడా ఎమ్మెల్యే ఆశావహుల నుంచి దరఖాస్తుల స్వీకరణ మొదలుపెట్టింది. ఈ నెలాఖరు వరకు కాంగ్రెస్, బీజేపీల జాబితాపై స్పష్టత రానుంది. ఇప్పటికే అధికార బీఆర్‌ఎస్ పార్టీ నుంచి పలువురు అసంతృప్తులు ఎలాగైనా ఎమ్మెల్యే బరిలో నిలిచేందుకు తమ ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. మరోవైపు త్వరలోనే బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి కూడా జాబితా వెల్లడయ్యాక.. అసంతృప్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. వీరంతా తమ పార్టీ, అధికార పార్టీ కాకుండా మరో ప్రత్యామ్నాయ వేదిక నుంచి పోటీ చేసేందుకు సై అంటారనడంలో సందేహం లేదు. ఈ క్రమంలో వీరికి రాజకీయంగా రెండు వేదికలు అందుబాటులో ఉంటాయి. అవి ఆలిండియా ఫార్వార్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ) కాగా, బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ). ఈ రెండు పార్టీలు జిల్లాలో చాలాకాలంగా తమ ఉనికి చాటుకుంటున్నాయి. రెండు పార్టీలకు బలమైన క్రియాశీలక నేతలు లేకపోయినా, అసంతృప్తులను అప్పటికపుడు అక్కున చేర్చుకునే రాజకీయ వేదికలుగా మారాయి.

సెంటిమెంట్‌కు మారుపేరుగా..

ఆలిండియా ఫార్వార్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ) గతంలో నామమాత్రంగా ఎన్నికల సమయంలో మాత్రమే తెరపైకి వచ్చేది. కానీ, 2018లో రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆలిండియా ఫార్వార్డ్ బ్లాక్(ఏఐఎఫ్‌బీ) గుర్తు సింహం సింబల్‌పై గెలుపొందడంతో ఈ పార్టీ పేరు రాష్ట్రవ్యాప్తంగా మార్మోగింది. అప్పట్లో కోరుకంటి చందర్ విజయం ఒక సంచలనం. చందర్ గెలిచిన తరువాత ఉమ్మడి జిల్లాలో సింహం గుర్తు సానుభూతికి మారుపేరుగా మారిపోయింది. అధికార – ప్రతిపక్ష పార్టీలో టికెట్ ఆశించి భంగపడ్డ వారంతా క్రమంగా ఏఐఎఫ్‌బీలో చేరడం, సింహం గుర్తుపై పోటీ చేయడం ఆనవాయితీగా మారింది. ఈ పార్టీగుర్తుపై పోటీ చేసిన వారిలో విజయశాతం కూడా బాగుండటం అసంతృప్తులు పార్టీని ఎంచుకోవడానికి ఒక కారణంగా రాజకీయ విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు. ఇదేదారిలో పయనించిన 24 మంది రాజకీయ నేతలు స్థానిక సంస్థల్లో విజయం సాధించి సింహం గుర్తుతో తమ సత్తా చాటుకున్నారు. అయితే, వీరంతా తరువాత అధికార పార్టీకి చేరువవుతండటం గమనార్హం. ప్రస్తుతం రామగుండంలో కందుల సంధ్యారాణి, పెద్దపల్లిలో నల్ల మనోహర్ రెడ్డి సింహం గుర్తుపై పోటీ చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారని సమాచారం. వీరే కాక ఉమ్మడి జిల్లాలో పలు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్, బీజేపీ అసంతృప్తులు సైతం బీఎస్పీతోనూ టచ్‌లో ఉన్నారని ప్రచారం జరుగుతోంది.

60 అసెంబ్లీ స్థానాల్లో పోటీ



క్రితంసారి రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో 188 మంది మా పార్టీ నుంచి పోటీ చేయగా.. 92 మంది విజయం సాధించారు. ఈసారి ఉమ్మడి జిల్లాలో 13 స్థానాలు, రాష్ట్రవ్యాప్తంగా 60 స్థానాల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నాం. ఏఐఎఫ్‌బీ వ్యవస్థాపకుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ భావజాలానికి, ఆయన సిద్ధాంతాలను అభిమానించే వారు, కేంద్ర– రాష్ట్ర ప్రభుత్వాలపై వ్యతిరేకత ఉన్న వారు మా పార్టీని తప్పకుండా ఆదరిస్తారు.

– జోజిరెడ్డి, ఏఐఎఫ్‌బీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ఏఐఎఫ్‌బీ గెలిచిన సీట్లు ఇవే..

రామగుండం అసెంబ్లీ: ఎమ్మెల్యే (తర్వాత బీఆర్‌ఎస్‌లో చేరారు)

స్థానికసంస్థల్లో ఇలా..

- కరీంనగర్ కార్పొరేషన్‌లో 12 పోటీ మంది చేస్తే 3 సీట్లు దక్కించుకున్నారు. దాదాపుగా 12,700 ఓట్లు సాధించారు. అదేసమయంలో కాంగ్రెస్ 50 స్థానాల్లో పోటీ చేయగా.. 9,000కుపైగా ఓట్లు రావడం గమనార్హం.
- రామగుండంలో 14 స్థానాల్లో పోటీ చేయగా.. 9 మంది కార్పొరేటర్లు విజయం సాధించడం ఇక్కడ సింహం సింబల్‌కు ఉన్న ఆదరణకు నిదర్శనం.
- చొప్పదండిలో ఎంపీటీసీ స్థానం, పెద్దపల్లి 5 ఎంపీటీసీలు, మానకొండూరులో ఒకటి, రాయికల్‌లో ఒకటి, రామగుండంలో ఎంపీటీసీ మొత్తానికి 9 ఎంపీటీసీ స్థానాల్లో సింహం విజయం సాధించింది.
- చొప్పదండి మున్సిపల్‌లో ఒక కౌన్సిలర్, జగిత్యాలలో ఒక కౌన్సిలర్, పెద్దపల్లిలో ఒక కౌన్సిలర్ చొప్పున ముగ్గురు గెలిచారు.

బోణీ కోసం బీఎస్పీ తహతహ..

- 2004లో, 2014లో బీఎస్పీ తెలంగాణలో మంచిప్రభావమేచూపింది. 2014లో రెండు అసెంబ్లీ స్థానాలు గెలిచిన తరువాత తిరిగి ఆ స్థాయిలో ప్రభావం చూపలేకపోయింది. 2004లో కరీంనగర్ పార్లమెంటు నుంచి పోటీ చేసిన అభ్యర్థికి 43వేల ఓట్లు వచ్చాయి. 2006లో కోనరావుపేటలో ఐదు ఎంపీటీసీలు, సుల్తానాబాద్‌లో రెండు ఎంపీటీసీలు గెలుచుకుంది.
- 2021లో ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ రాష్ట్ర పగ్గాలు చేపట్టాక పార్టీ మునపటి కంటే ఆర్థికంగా బలపడిందన్న ధీమా కేడర్‌లో వ్యక్తమవుతోంది. ముఖ్యంగా పెద్దపల్లి అసెంబ్లీ బీఎస్పీ అభ్యర్థి దాసరి ఉష(ఐఐటీ– ఖరగ్‌పూర్) పార్టీ కార్యక్రమాల్లో క్రియాశీలకంగా ఉంటూ, విజయంపై ధీమాగా ఉన్నారు. మిగిలిన స్థానాల్లోనూ నిశ్శబ్ద ఫలితాలు ఉంటాయని, ప్రవీణ్‌కుమార్ నాయకత్వం, ఆయనకు జిల్లాతో ఉన్న అనుబంధం తమకు కలిసి వస్తుందని నాయకులు ధీమాగా ఉన్నారు. ఈసారి పోటీ చేసేందుకు ఇతర పార్టీల నుంచి వచ్చినా.. తమపార్టీ నిబంధనలకు కట్టుబడి ఉంటేనే టికెట్ ఇస్తామని నాయకులు స్పష్టంచేస్తున్నారు.



ధర్మపురిలో ఘనంగా భరణి నక్షత్ర పూజలు



ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీ నృసింహస్వామి అనుబంధ శ్రీయమధర్మ రాజు ఆలయంలో మంగళవారం భరణి నక్షత్రం సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేకపూజలు చేశారు. ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేదపండితుడు ముత్యాలశర్మ మంత్రోచ్చారణలతో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. దేవస్థానం సూపరింటెండెంట్ కిరణ్, సిబ్బంది, రెనోవేషన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జిల్లాకు 1,626 మెట్రిక్ టన్నుల యూరియా

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాకు 1,626 మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించారని జిల్లా వ్యవసాయాధికారి సురేశ్‌కుమార్ మంగళవారం తెలిపారు. బుధవారం ప్రత్యేక రైల్వే వ్యాగన్ ద్వారా జిల్లా కేంద్రానికి చేరుకుంటుందని ఆయన పేర్కొన్నారు. యూరియా కొరత లేదని తెలిపారు. రైతులు ఆందోళన చెందవద్దని ఆయన సూచించారు.

పేదల కోసమే 'ఆరోగ్య మహిళ'

ధర్మపురి: మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసం అమలు చేస్తున్న ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో శ్రీనివాస్ సూచించారు. నేరెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం మహిళలకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. ప్రతీ మంగళవారం ఆస్పత్రిలో 83 రకాలైన వ్యాధుల నిర్ధారణ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తారని ఆయన తెలిపారు. మొత్తం 86 మంది ఆస్పత్రికి రాగా అందులో 22 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఆయన వివరించారు. రొమ్ము క్యాన్సర్, ముఖద్వారా పరీక్షలు, మూత్ర ఇన్ఫెక్షన్, పౌష్టికాహార లోపం, థైరాయిడ్, బ్లడ్ పిక్చర్ తదితర పరీక్షలను నిర్వహించామన్నారు. 18 మందిని మెరుగైన వైద్యం కోసం జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. డాక్టర్ శివకుమార్, హెచ్‌ఈవో రాజేశం, సతీశ్‌కుమార్ పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తం

- అందుబాటులో కంట్రోల్ రూమ్
- హెల్ప్‌లైన్ నంబరు 08724-222557
- కలెక్టర్ యాస్మిన్ బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్‌బాషా

జగిత్యాల: జిల్లాలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ యాస్మిన్ బాషా ఆదేశించారు. తొలుత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో మాట్లాడారు. అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ యాస్మిన్‌బాషా సమావేశం నిర్వహించారు. భారీవర్షాల నేపథ్యంలో ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం వాటిల్లకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని చెప్పారు. గర్భిణులను పరిస్థితులను బట్టి వెంటనే ఆస్పత్రులు, సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. తహసీల్దార్లు, మెడికల్ ఆఫీసర్లు ఇందులో పాలుపంచుకోవాలని కలెక్టర్ అన్నారు. జిల్లాలోనిలో లెవల్ వంతెనలు, రహదారులపై 24 గంటల పాటు పర్యవేక్షణ కొనసాగించాలని చెప్పారు. గోదావరి నది పరీవాహక ప్రాంతాల్లోకి పశువులు, గొర్రెలు, మత్స్యకార్మికులు, రైతులు వెళ్లకుండా చూడాలని పేర్కొన్నారు. నీటి ప్రవాహం అధికంగా ఉన్నచోట హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కు సద్వినియోగం చేసుకోవాలి

ట్రాన్స్‌జెండర్లు తమ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ యాస్మిన్ బాషా సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో ట్రాన్స్‌జెండర్లకు ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. కాగా, తమకు రేషన్‌కార్డులు మంజూరు చేయాలని, కలెక్టరేట్‌లో క్యాంటిన్ సౌకర్యం కల్పించాలని ట్రాన్స్‌జెండర్లు కలెక్టర్‌కు విన్నవించారు. నోడల్ అధికారి లక్ష్మీనారాయణ, డీఆర్డీఏ పీడీ నరేశ్, జిల్లా సంక్షేమాధికారి నరేశ్, మెప్మా అధికారులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ది ఎప్పుడూ ప్రజాపక్షమే

- సాంఘిక సంక్షేమ మంత్రి కొప్పుల ఈశ్వర్
- మూడు గ్రామాల్లో ప్రజా ఆశీర్వాదయాత్ర



కొప్పుల ఈశ్వర్‌కు కుంకుమ దిద్దుతున్న మహిళ

గొల్లపల్లి(ధర్మపురి): బీఆర్‌ఎస్‌ది ఎప్పుడూ ప్రజాపక్షమేనని సాంఘిక సంక్షేమ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. లొత్తునూర్, బొంకూర్, అబ్బాపూర్ గ్రామాల్లో మంగళవారం ఆయన ప్రజా ఆశీర్వాద పాదయాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ, ప్రజల కోసం రేయింబవళ్లు పనిచేస్తున్నానన్నారు. ధర్మపురి నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషి చేశానని అన్నారు. మరోసారి ఆశీర్వదిస్తే అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీకి మళ్లీ భంగపాటు తప్పదని మంత్రి జోస్యం చెప్పారు. తెలంగాణ ప్రజలు 'కారు.. సారు.. కేసీఆర్.. బీఆర్‌ఎస్..' వైపే ఉన్నారని పేర్కొన్నారు. ప్రజల ఆశీస్సులతో మరోసారి గెలిచి చరిత్ర సృష్టిస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన వారిని కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నక్క శంకర్, జెడ్పీటీసీ జలేందర్, వైస్ ఎంపీపీ ఆవుల సత్యం, మండల అధ్యక్షుడు బొల్లం రమేశ్, నాయకులు తిరుపతి, పుట్టపాక సత్యం, సర్పంచ్ కందుకూరి సత్యనారాయణ పాల్గొన్నారు.



సారంగాపూర్ : రేచపల్లి ఊరచెరువు వద్ద వరద ఉధృతి



కోరుట్ల రూరల్ : కొండ్రికర్ల శివారులో విరిగిపడ్డ చెట్టు

ఆగని వానజోరు

సారంగాపూర్(జగిత్యాల): జిల్లాలో మూడోరోజు మంగళవారం కూడా వానజోరుగా కురిసింది. సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లోని పంట పొలాల్లో ఇసుక మేటలు వేశాయి. కోనాపూర్ వద్ద వరద ఉధృతికి అప్రోచ్‌రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో జగిత్యాల రూరల్ మండలం అనంతరాం మీదుగా జగిత్యాలకు వాహనాలు దారిమళ్లించారు.

మెట్‌పల్లిరూరల్: కొండ్రికర్ల శివారులో భారీ చెట్టు నెలకొరిగింది. తాత్కాలిక వంతెన కొట్టుకుపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

రాయికల్(జగిత్యాల): ఇటిక్యాల, మూటపల్లి, కల్వర్టులపై వరద ఉధృతి పెరిగింది. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



రాయికల్‌లో..

ఉపాధ్యాయులే మార్గదర్శకులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: ఉపాధ్యాయులే మార్గదర్శకులని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 28 మందికి పురస్కారాలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. నైతిక విలువలు నేర్పేది ఉపాధ్యాయులేనని, విద్యార్థులు వారిద్వారానే నేర్చుకుంటారని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన చేయాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక క్లాసులు తీసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయుల్లో క్రమశిక్షణ ఉండాలని, దానిద్వారానే మంచి ఫలితాలు వస్తాయన్నారు. విద్యార్థి దశ కీలకమైందని, దానిని సద్వినియోగం చేసుకోకపోతే దుష్ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, అదనపు కలెక్టర్ లత, డీఈవో జగన్‌మోహన్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంత్రి కొప్పులది కపట ప్రేమ

- రైతుల సంక్షేమంపై పట్టింపులేదు
- అధికార దుర్వినియోగం చేస్తున్నారు
- ప్రజా ఆశీర్వాదయాత్రలో 4 ప్రశ్నలకు సమాధానం చెప్పాలి
- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ డిమాండ్



మాట్లాడుతున్న లక్ష్మణ్ కుమార్

వెల్గటూర్(ధర్మపురి): మంత్రి కొప్పుల ఈశ్వర్ రైతులపై కపటప్రేమ చూపిస్తున్నారని డీసీసీ అధ్యక్షుడు లక్ష్మణ్ కుమార్ విమర్శించారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా ఆశీర్వాదయాత్ర పేరిట జగదేవుపేటలో సోమవారం పర్యటించిన మంత్రి కొప్పుల ఈశ్వర్.. డ్రెస్‌కోడ్‌తో హాజరు కావాలని అంగన్‌వాడీ టీచర్లు, మహిళా సంఘాల సీఏలు, అధికారులకు అంతకు ముందురోజే అధికారులతో ఆదేశాలు ఇప్పించారని ఆరోపించారు. అక్కడ చేసిన పనులేమీ లేవన్నారు. అయితే, ఆశీర్వాదయాత్ర ద్వారా మంత్రి నాలుగు ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నిజంగా ప్రజల ఆశీర్వాదంతో గెలిస్తే ఎన్నికల రీ కౌంటింగ్‌కు ఒప్పుకుంటున్నావా? జగదేవుపేట జంగల్‌నాలా ప్రాజెక్టు పనులు ఎందుకు ప్రారంభించలేదు? కాళేశ్వరం లింక్–2 కోసం జగదేవుపేట గ్రామస్తుల నుంచి లాక్కున్న భూములకు చొప్పదండిలో ఇచ్చినట్లు రూ.20 లక్షల పరిహారం ఎందుకు ఇవ్వలేదు? స్తంభంపల్లి శివారులో ప్రతిపాదించిన ఇథనాల్ పరిశ్రమ రద్దు చేశారా? లేదా?.. ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాలని లక్ష్మణ్‌కుమార్ డిమాండ్ చేశారు. రుణమాఫీ పేరిట వడ్డీ మాఫీచేసి రైతులను మోసం చేశారని, వడ్ల కొనుగోళ్లలో మిల్లర్లు కోతలు విధించి రైతులను దోచుకున్న సొమ్ము ఏమైందని మంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అక్రమాలకు పాల్పడ్డ ఎంతమంది రైస్‌మిల్లర్లపై మంత్రి చర్యలు తీసుకున్నారో సమాధానం చెప్పాలని అన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, సర్పంచ్ మురుగు మురళి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేశ్, నాయకులు శ్రీకాంత్‌రావు, సందీప్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

లభించని మత్స్యకారుడి ఆచూకీ

జగిత్యాల క్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని భీష్మనగర్‌కు చెందిన కోండ్ర విద్యాసాగర్ ఆదివారం సాయంత్రం చేపల వేటకు వెళ్లి, వరదలో గల్లంతవగా ఆచూకీ ఇంకా లభించలేదు. పోలీసులు హైదర్‌పల్లి, గుల్లపేట, అనంతారం, యశ్వంతరావుపేట శివారులోని వాగు పరివాహక ప్రాంతాల్లో ముమ్మరంగా గాలిస్తున్నారు. బాధిత కుటుంబసభ్యులు రోదిస్తున్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

మల్యాల(చొప్పదండి): ఆత్మహత్యాయత్నం చేసిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. మల్యాల మండలంలోని తక్కళ్లపల్లికి చెందిన గొల్లపల్లి గణేశ్(21) మతిస్థిమితం సరిగా ఉండటం లేదు. ఈ నెల 4న అర్ధరాత్రి ఉరేసుకొని, ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబసభ్యులు జగిత్యాల ఏరియా ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి తండ్రి రవీందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

కోరుట్ల: స్థానిక పూల్‌వాగు వద్ద ఓ మహిళ ఆత్మహత్యాయత్నం చేసింది. వివరాల్లోకి వెళ్తే.. గొల్లపల్లి మండలానికి చెందిన స్వరూపకు కోరుట్ల మండలంలోని తిమ్మయ్యపల్లెకు చెందిన వ్యక్తితో వివాహమైంది. భర్తతో విభేదాలతో మనస్తాపానికి గురైన ఆమె మంగళవారం సాయంత్రం పూల్‌వాగులో దూకేందుకు ప్రయత్నించగా అక్కడున్నవారు అడ్డుకున్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసులు ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చి, బంధువులకు అప్పగించారు.

కబేలాలకు తరలిస్తున్న ఆవుల పట్టివేత

ధర్మారం: కబేలాలకు తరలిస్తున్న ఆవులను మంగళవారం పట్టుకున్నట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మంగళవారం వెల్గటూర్ మండలంలోని రాజారాంపల్లి వారసంత నుంచి ఇద్దరు వ్యక్తులు నాలుగు ఆవులు, రెండు దూడలను వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్నారు. పత్తిపాక ఎక్స్‌రోడ్డు వద్ద వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులు వ్యాన్‌ను ఆపారు. లోపల చూడగా జీవాలు కనిపించాయి. వాటిని గోశాలకు తరలించి, సంబంధిత వ్యక్తులపై సుమోటోగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రుణమాఫీ రూ.228 కోట్లే

- జిల్లాలో ఇంకా చేయాల్సింది రూ.312 కోట్లు
- అడ్డంకిగా ఖాతాలు సరిగా పని చేయకపోవడం
- ఈ నెలాఖరులోగా పూర్తికి ప్రభుత్వం చర్యలు
- రైతుల వివరాల సేకరణకు కమిటీల ఏర్పాటు


వెంగళాపూర్‌లో వరికి క్రిమిసంహారక మందు పిచికారీ చేస్తున్న రైతు

జగిత్యాల అగ్రికల్చర్: బ్యాంకుల నుంచి లక్ష రూపాయల పంట రుణం తీసుకున్న రైతులందరికీ ఆ మొత్తాన్ని మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే, రుణమాఫీ డబ్బులు విడుదల చేసినప్పటికీ కొందరు రైతుల ఖాతాల్లో జమ కాలేదు. ప్రభుత్వం మాత్రం ఎలాగైనా ఈ నెలాఖరులోగా చేయాలన్న దృఢ సంకల్పంతో ఉంది. ఈ మేరకు ఎవరికైతే పంట రుణమాఫీ సమాచారం వచ్చి, ఖాతాల్లో డబ్బులు పడలేదో ఆ రైతుల వివరాలు క్షేత్ర స్థాయిలో సేకరించేందుకు కమిటీలు ఏర్పాటు చేసింది. దీనికితోడు, రుణమాఫీకి సంబంధించి జిల్లాకో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసి, నోడల్ అధికారిని నియమించాలని కలెక్టర్లను ఆదేశించింది.

జిల్లాలో అర్హులు 1,02,112 మంది

జగిత్యాల జిల్లాలో రూ.లక్షలోపు పంట రుణం తీసుకున్న వారిలో 1,02,112 మందిని అర్హులుగా ప్రభుత్వం తేల్చింది. వీరందరికీ రూ.541.41 కోట్లు మాఫీ కావాల్సి ఉంది. అయితే, ఇప్పటివరకు 44,509 మందికి రూ.228.99 కోట్లు మాఫీ అయ్యాయి. ఇంకా 57,603 మందికి రూ.312.42 కోట్లు చేయాల్సి ఉంది.

150 మంది ఖాతాల్లో జమ కాలేదు

జిల్లాలో ఇప్పటివరకు పంట రుణం మాఫీ అయిన 153 మంది రైతుల ఖాతాల్లో రూ.85 లక్షలు జమ కాలేదు. పంట రుణమాఫీ కార్యక్రమం పూర్తయ్యే వరకు మరో 200 నుంచి 300 మంది ఖాతాల్లో డబ్బులు జమ అయ్యే పరిస్థితి లేదని అధికారులు చెబుతున్నారు. 2018లో అన్నదాతలు ఇచ్చిన బ్యాంకు ఖాతాలు సరిగా పని చేయకపోవడం, అకౌంట్లను రద్దు చేసుకోవడం, బ్యాంకు అకౌంట్ నంబర్లను, బ్యాంకులను మార్చడం, ఈ సమయంలోనే బ్యాంకుల విలీనం జరగడం వంటివి అడ్డంకిగా మారాయని బ్యాంకర్లు అంటున్నారు.

అధికారుల క్షేత్రస్థాయి చర్యలు

రుణమాఫీకి సంబంధించిన ప్రతీ రూపాయి రైతులకు చెందాలని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో బ్యాంకర్లు, వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయి చర్యలకు దిగారు. ఈ మేరకు మొదట రైతుబంధు డబ్బులు పడే అన్నదాతల ఖాతాలను గుర్తించేందుకు సమాయత్తమవుతున్నారు. అలాగే, ఆధార్ నంబర్ల సహాయంతో రైతుల అకౌంట్లలో రుణమాఫీ డబ్బులు జమ చేయాలని చూస్తున్నారు. లేదంటే, ఎన్‌పీసీఐ సహాయంతో బ్యాంకులు రైతుల ఖాతాలను గుర్తించి, వివరాలు పంపిస్తే డబ్బులు జమ చేసేలా ఏర్పాట్లు చేశారు. అప్పటికీ అన్నదాతల వివరాలు లభించకపోతే చివరగా, గ్రామాల వారీగా క్షేత్రస్థాయి పర్యటనలు చేసి, రైతులను గుర్తించి, వారిచే ఖాతాలు తెరిపించి, డబ్బులు జమ చేయాలని భావిస్తున్నారు. ఇందుకోసం కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయనున్నారు. ఇందులో ఓ అధికారిని నియమించి, వారి ఫోన్ నంబర్‌ను రైతులకు అందుబాటులో ఉంచాలని నిర్ణయించారు. అలాగే, రుణమాఫీ అయిన కర్షకులకు తిరిగి పంట రుణం ఇచ్చేలా బ్యాంకులు చొరవ చూపాలని ప్రభుత్వం కోరుతోంది.

వివరాలు సేకరిస్తున్నాం



బ్యాంకు ఖాతాలు సరిగా లేని రైతుల వివరాలు సేకరిస్తున్నాం. ప్రభుత్వం రుణమాఫీ చేసిన వారందరికీ బ్యాంకులు వారి ఖాతాల్లో డబ్బులు జమ చేస్తాయి. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.
– వెంకట్ రెడ్డి, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్

భూ సర్వేను అడ్డుకున్న యజమానులు


పత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

మానకొండూర్: మండల కేంద్రంలోని సుజల–స్రవంతి పైప్‌లైన్ పక్కన ఉన్న భూమిని మంగళవారం గోదావరి ట్రాన్స్‌మిషన్ జనరల్ మేనేజర్, సిబ్బంది సర్వేచేపట్టారు. ప్రధాన రహదారి పక్కన 2013లో ఎల్లంపల్లి నుంచి హైదరాబాద్‌కు తాగునీటి కోసం మౌలానా అబ్దుల్‌కలాం సుజల స్రవంతి ప్రాజెక్ట్ పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపట్టారు. పనుల్లో భాగంగా భూమిని కోల్పోయిన వారందరికి నష్టపరిహారం చెల్లించారు. పరిహారం అందని సయ్యద్ దుర్దానాబేగం, అష్రఫ్‌ఖలీద్ కుటుంబానికి చెందిన భూమిని సర్వే చేసేందుకు గోదావరి ట్రాన్స్‌మిషన్ జనరల్ మేనేజర్ బ్రిజేష్, సిబ్బంది మంగళవారం వచ్చారు. విషయం తెలుసుకున్న బాధితులు నష్టపరిహారం చెల్లించే వరకు స్థలంలో ఎలాంటి హద్దులు పెట్టద్దని, నిర్మాణాలు చేయవద్దని ఆందోళన చేపట్టారు. పైప్‌లైన్ నిర్మాణ పనులు పూర్తయి పదేళ్లు అవుతున్నా పరిహారం అందలేదని, ఎలాంటి నోటీసులు జారీ చేయకుండానే అధికారులు వచ్చి భూసర్వే చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ రికార్డులు పరిశీలించి, న్యాయంచేస్తామని జీఎం హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు. గతంలో 30మీటర్ల వెడల్పుతో పైపులైన్ల పనులు జరిగాయని, కొంతమంది నష్టపరిహారం తీసుకుని పైప్‌లైన్ నిర్మించిన ప్రదేశంలో అక్రమంగా కట్టడాలు నిర్మించారని ఆరోపించారు. అక్రమంగా నిర్మించిన కట్టడాలపై చర్యలు చేపడతామని జీఎం పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని తుమ్మనపల్లి వద్ద హుజూరాబాద్– కరీంనగర్ జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. ఒకరు మృతిచెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. మృతుడి కుటుంబ సభ్యులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపల్లి–ఇందిరానగర్ కాలనీకి చెందిన ఎర్ర లింగయ్య (48), ఆరెపల్లి సమ్మయ్య దినసరి కూలీలు. మంగళవారం ఉదయం ఇద్దరు కలిసి ద్విచక్ర వాహనంపై తుమ్మనపల్లి గ్రామంలో కూలీకి వెళ్తున్నారు. కరీంనగర్ నుంచి వరంగల్ వైపు వస్తున్న ఓ కారు ఎదురుగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఎర్ర లింగయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ఆరెపల్లి సమ్మయ్యకు తీవ్ర గాయాలు అయ్యాయి. సమ్మయ్యను మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. లింగయ్యకు భార్య లక్ష్మి, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. వంశీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు కిందకు దూసుకెళ్లిన కారు

శంకరపట్నం(మానకొండూర్): మండలంలోని తాడికల్ శివారులో మంగళవారం ఓ కారు రోడ్డు కిందకు దూసుకెళ్లింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కరీంనగర్‌కు చెందిన మెట్ట రాజేశం(48), లావణ్య, సందీప్, దిలీప్, మరో యువతి కారులో కరీంనగర్ నుంచి హుజూరాబాద్ వైపు వెళ్తున్నారు. తాడికల్ శివారులో ఫోర్‌లైన్ విస్తరణలో భాగంగా రోడ్డు పక్కన ఉన్న చెట్ల కొమ్మలు కోసి పడేశారు. వీరు ప్రయాణిస్తున్న కారు కల్వర్టును తప్పించబోయి వేగంగా చెట్లకొమ్మలను ఢీకొని బోల్తాపడింది. కారులో ప్రయాణిస్తున్నవారికి స్వల్పగాయాలు అయ్యాయి. స్థానికులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని, బాధితులను 108 వాహనంలో కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అసమానతలులేని విద్యావిధానం అమలు చేయాలి

- పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పెద్దింటి రామకృష్ణ


మాట్లాడుతున్న రామకృష్ణ

కరీంనగర్: సమాజంలో అసమానతలు లేని శాస్త్రీయ విద్యా విధానాన్ని అమలు చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెద్దింటి రామక్రిష్ణ అన్నారు. మంగళవారం సంఘ కార్యాలయంలో జరిగిన ఉమ్మడి జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. నేడు దేశంలో,రాష్ట్రంలో కార్పొరేట్ విద్య, ప్రైవేట్ విద్య, ప్రభుత్వ విద్య అని మూడు రకాల విధానం కొనసాగుతోందని అన్నారు. డబ్బున్నోళ్లు కార్పొరేట్ విద్యను, మధ్యతరగతి వారు ప్రైవేటు విద్యను, పేదలు, బడుగు బలహీన వర్గాల వారు ప్రభుత్వ విద్యను అభ్యసిస్తున్నారన్నారు. పేదలు చదివే ప్రభుత్వ విద్య అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతోందని వివరించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రోజురోజుకు ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తూ ప్రైవేటు కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్నాయని అన్నారు. వివక్ష, అసమానతలు లేని శాస్త్రీయపరమైన విద్యావిధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అంగడి కుమార్, జిల్లా నాయకులు రాజు, రమేశ్, మారుతి ఎల్లయ్య, ఏ.దేవేందర్, అరుణ్, వేణుగోపాల్, ధనుష్, వర్మ, విష్ణువర్ధన్, హరీశ్, హర్షవర్ధన్, మణికంఠ, జీవన్‌పాల్, రమేశ్, సంజయ్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల నిర్వహణ



మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్ బాషా

- కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ప్రజాస్వామ్యబద్ధంగా అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని కలెక్టర్‌యాస్మిన్ బాషా సూచించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో సెక్టోరల్, సెక్టార్ పోలీసు అధికారులకు పోలింగ్ నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల నిర్వహణలో సెక్టార్, పోలీసు సెక్టార్ అధికారుల పాత్ర కీలకమన్నారు. జిల్లా మూడు నియోజకవర్గాల పరిధిలో విస్తరించి ఉందన్నారు. అయితే, జిల్లాలోని 785 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల విధుల పర్యవేక్షణకు 78 మంది, రూట్లలో 78 మంది సెక్టార్ అధికారులను నియమించామని, వీరికి అదనంగా 20 శాతం సెక్టార్ అధికారులను రిజర్వ్ చేశామని చెప్పారు. సెక్టార్ అధికారులు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాల రూట్‌మ్యాప్ పరిశీలించాలని, మౌలిక వసతులు కల్పించాలని, కొత్త పోలింగ్ కేంద్రాలపై విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. 200 మీటర్ల పరిధిలో పార్టీ కార్యాలయాలు లేకుండా చూడాలని, అనుమతులు లేని ప్రచార వాహనాలు, ప్రభుత్వ భవనాలు, ఉద్యోగుల వాహనాల వినియోగం, ఎంసీసీ నిబంధనల ఉల్లంఘనపై నిఘా ఉంచాలని సూచించారు. ఓటరు సవరణపై ప్రచారం నిర్వహించాలని అన్నారు. అధికారవర్గం ఉన్న ఓటరు జాబితాలో పేర్లు చూసుకునేలా ఓటర్లకు సమాచారం అందించాలన్నారు. ఈవీఎంల వినియోగంపై విస్తృత ప్రచారం కల్పించాలని, పోలింగ్‌కు ఐదు రోజుల ముందు ఓటర్లకు చీటీలు అందజేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ భాస్కర్, అదనపు కలెక్టర్లు దివాకర, లత, ఆర్డీవోలు నర్సింహమూర్తి, రాజశేఖర్, తిరుపతి పాల్గొన్నారు.

రామకృష్ణయ్య ఉపాధ్యాయలోకానికి ఆదర్శం


నివాళి అర్పిస్తున్న రామకృష్ణయ్య శిష్యులు

జగిత్యాలజోన్: విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపిన ఆనాటి గురువు ముద్దు రామకృష్ణయ్య నేటి ఉపాధ్యాయ లోకానికి ఆదర్శనమని ముద్దు రామకృష్ణయ్య ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి సూరజ్ శివశంకర్ అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రామకృష్ణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరు దశాబ్దాల క్రితం ఉపాధ్యాయుడిగా పనిచేసిన రామకృష్ణయ్య అప్పట్లోనే విదేశాల్లోని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా విద్యాబోధన చేపట్టిన మహనీయుడని కొనియాడారు. ఆయన శిష్యులు ఎలిమిల్ల సత్తయ్య, ఎర్ర తిరుపతి, అయ్యవారి లక్ష్మీనారాయణ, బాలగంగాధర్, తాటిపల్లి ఆనందం, ఆవారి కైలాసం, అలిశెట్టి ఈశ్వరయ్య, కస్తూరి కిషన్, లచ్చన్న, చంద్రమౌళి పాల్గొన్నారు

కాలువలో దూకి మహిళ ఆత్మహత్యాయత్నం

- కాపాడిన బ్లూకోల్ట్స్ సిబ్బంది


గంగమ్మను ఒడ్డుకు తీసుకువస్తున్న పోలీసులు

మల్యాల(చొప్పదండి): అనారోగ్య సమస్యలతో మనస్తాపం చెందిన ఓ మహిళ వరద కాలువలో దూకగా బ్లూకోల్ట్స్ పోలీసులు కాపాడారు. వివరాల్లోకి వెళ్తే.. ఇబ్రహీంపట్నం మండలంలోని వేములకుర్తి గ్రామానికి చెందిన మెట్‌పల్లి గంగమ్మ అనారోగ్య సమస్యలతో బాధ పడుతోంది. మంగళవారం మల్యాల అడ్డరోడ్డు సమీపంలోని వరద కాలువ వద్దకు వచ్చి, అందులో దూకింది. స్థానికులు గమనించి, 100కు ఫోన్ చేయగా మల్యాల బ్లూకోల్ట్స్ సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. కాలువలో దిగి, బాధితురాలిని ఒడ్డుకు చేర్చారు. అనంతరం 108 వాహనంలో జగిత్యాల ఆస్పత్రికి తరలించారు. బ్లూకోల్ట్స్ సిబ్బంది ఇన్‌చార్జి హెడ్‌కానిస్టేబుల్ భాస్కర్, కానిస్టేబుల్ సురేశ్, హోంగార్డు సంపత్, మహిళా కానిస్టేబుల్ జ్యోతిని సీఐ కోటేశ్వర్, ఎస్సై అశోక్ అభినందించారు.

బాధితులకు డీసీసీ అధ్యక్షుడి పరామర్శ


బాధితులను పరామర్శిస్తున్న లక్ష్మణ్‌కుమార్

వెల్గటూర్: గుండెపోటుతో చనిపోయిన జగదేవ్‌పేటకు చెందిన తాత్కాలిక పంచాయతీ పారిశుద్ధ్య కార్మికురాలు బచ్చల శాంతమ్మ కుటుంబాన్ని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మంగళవారం పరామర్శించారు. బాధిత కుటుంబసభ్యులకు రూ.5 వేల ఆర్థికసాయం అందించారు. సోమవారం మంత్రి ఈశ్వర్ ప్రజా ఆశీర్వాద యాత్రలో పాల్గొని, తర్వాత రోడ్లను శుభ్రం చేస్తూ తీవ్ర అస్వస్థతకు గురైన శాంతమ్మ గుండెపోటుతో మృతిచెందిందని తెలిపారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించే సమయం కూడా మంత్రికి లేకపోయిందని విమర్శించారు. మృతురాలి కుటుంబానికి వెంటనే రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, డబుల్ బెడ్‌రూం ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు తిరుపతి, నాయకులు హరీశ్, తిరుపతి, శ్రీను, లింగారెడ్డి, జగన్, బుచ్చయ్య, సత్తయ్య, జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టారీతిన ల్యాబ్‌ల ఏర్పాటు

- జిల్లాలో 300 వరకు అనుమతి లేనివే
- వైద్య పరీక్షల పేరిట దోపిడీ
- వైద్యశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు

జగిత్యాలలోని కృష్ణానగర్‌కు చెందిన ఓ మహిళ అనారోగ్యానికి గురికావడంతో కుటుంబసభ్యులు అశోక్‌నగర్‌లోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వివిధ రకాల టెస్ట్‌ల పేరిట రూ.4,400 బిల్లు వేశారు. ఇంత బిల్లా అని అడిగితే ఈ టెస్ట్‌లకు అంతే ఉంటుందని ల్యాబ్ యజమానులు జవాబిచ్చారు.

జగిత్యాలలోని విద్యానగర్‌కు చెందిన ఓ ఉపాధ్యాయుడికి తీవ్ర జ్వరం వచ్చింది. సమీపంలోని ఓ ఆస్పత్రికి వెళ్లగా బ్లడ్, యూరిన్ టెస్ట్‌లు అంటూ రూ.3 వేల బిల్లు వేశారు. ఈ టెస్ట్‌లకు ఇంత బిల్లు ఏంటని ప్రశ్నిస్తే చాలా రకాల వైద్య పరీక్షలు చేశామని, బిల్లు అంతేనని చెప్పడంతో చేసేదిలేక చెల్లించారు.



జగిత్యాల: మొన్నటి వరకు ఎండలు.. ఇప్పుడు వర్షాలు.. వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటు చేసుకోవడంతో వైరల్ ఫీవర్లు వచ్చి, ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఇదే అదునుగా కొన్ని ఆస్పత్రులు వివిధ రకాల టెస్ట్‌ల పేరిట వారిని ఆర్థికంగా దోపిడీ చేస్తున్నారు. పలువురు ఎలాంటి అనుమతి లేకుండానే ఇష్టానుసారంగా ల్యాబ్‌లు ఏర్పాటు చేసుకొని, వైద్య పరీక్షలు చేస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. వైద్యశాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి.

నిబంధనల అమలేది?

వాస్తవానికి ఒక ల్యాబ్ ఏర్పాటు చేయాలంటే సుమారు 100 స్క్వేర్ ఫీట్స్ స్థలం, అన్ని రకాల మెషిన్లు ఉండాలి. ల్యాబ్‌లో ఎంబీబీఎస్ డాక్టర్‌తోపాటు పాథాలజిస్ట్, టెక్నీషియన్స్, మైక్రో బయాలజిస్ట్ ఉండాలి. కానీ ఇవేవీ లేకుండానే ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. రోగికి చేసే పరీక్షల్లోనూ ప్రమాణాలు పాటించడం లేదు.

గల్లీకొకటి ఏర్పాటు

జగిత్యాల జిల్లా కేంద్రంతోపాటు కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపాలిటీల్లో ల్యాబ్‌లు ఇష్టారాజ్యంగా వెలిశాయి. ఆస్పత్రుల్లో, ల్యాబ్‌ల్లో పనిచేసిన వారు ఎలాంటి అర్హత లేకున్నా గల్లీకో ల్యాబ్‌ను చిన్నపాటి మెట్ల సందులు, చిన్నచిన్న షట్టర్లలో ఏర్పాటు చేశారు. రక్త, మూత్ర పరీక్షలు చేస్తూ రూ.300 నుంచి రూ.500 వరకు వసూలు చేస్తున్నారు. వైద్యులకు కమీషన్ ఇస్తూ రోగులను తమ ల్యాబ్‌లకు పంపించాలని కోరుతున్నారు. వారు ఇచ్చే రిపోర్టుల్లో సైతం అనేక తప్పులు చోటుచేసుకుంటున్నాయని పలువురు అంటున్నారు.

అనుమతి ఉన్నవి నాలుగే..

జిల్లా కేంద్రంలో అసలు అన్ని నిబంధనలతో కూడిన ల్యాబ్‌లు నాలుగు మాత్రమే ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. దాదాపు 300 వరకు అనుమతి లేనివే ఉన్నాయి. నిబంధనల ప్రకారం నర్సింగ్‌హోమ్‌లకు మాత్రమే అనుబంధంగా ల్యాబ్‌లుంటాయి. కానీ ఇక్కడ ఎక్కడపడితే అక్కడ ఏర్పాటు చేశారు.

కఠినచర్యలు తీసుకుంటాం



ల్యాబ్‌లో ఎంబీబీఎస్ డాక్టర్‌తోపాటు పాథాలజిస్ట్, మైక్రో బయాలజిస్ట్ తప్పకుండా ఉండాలి. ఎక్కడపడితే అక్కడ ల్యాబ్‌లు ఏర్పాటు చేయకూడదు. వైద్యశాఖ అనుమతి, అన్ని రకాల యంత్రాలు ఉండాలి. కొన్నింటిని ఇప్పటికే సీజ్ చేశాం. మా దృష్టికి వస్తే కఠినచర్యలు తీసుకుంటాం.
– శ్రీధర్, డీఎంహెచ్‌వో

ఆఫర్ల పేరిట ప్రచారం..

రక్త, మూత్ర, ఇతర వైద్య పరీక్షలు చేస్తామంటూ ల్యాబ్‌ల నిర్వాహకులు ఆఫర్లు ఇస్తున్నారు. ముఖ్యంగా కరపత్రాలు పంచుతూ, శిబిరాలు పెడుతూ ప్రచారం చేస్తున్నారు. థైరాయిడ్, కిడ్నీ, లివర్, లిపిడ్ ప్రొఫైల్ వంటి పరీక్షలను రూ.200లకే చేస్తామని, రూ.1,000కే 50 రకాల టెస్ట్‌లు అంటూ బోర్డులు తగిలిస్తున్నారు.

విదేశాలకు వెళ్లేవారికి చెకప్..

జిల్లా నుంచి అనేక మంది విదేశాలకు వెళ్తుంటారు. అంతకంటే ముందు వారు అన్ని రకాల వైద్య పరీక్షలు చేయించుకోవాల్సి ఉంటుంది. ఇలాంటివారి వద్ద ల్యాబ్‌ల నిర్వాహకులు ఎక్కువ మొత్తంలో డబ్బులు తీసుకుంటూ తప్పుడు రిపోర్ట్‌లు ఇస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ల్యాబ్‌ల ఎదుట విదేశాలకు వెళ్లే వారికి చెకప్ చేయబడునని బోర్డులు పెడుతున్నారు. ఇంత జరుగుతున్నా వైద్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని పలువురు మండిపడుతున్నారు.

స్క్రీనింగ్ కమిటీ చైర్మన్‌ను కలిసిన 'అడ్లూరి'


చైర్మన్ మురళీధరన్‌తో లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి: హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మంగళవారం డీసీసీ అధ్యక్షుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా స్క్రీనింగ్ కమిటీ చైర్మన్, ఎంపీ మురళీధరన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి, పార్టీ కండువాతో సత్కరించారు. జిల్లాలో కాంగ్రెస్ బలోపేతం కోసం తీసుకుంటున్న చర్యలు, ఏఐసీసీ, పీసీసీ ఇచ్చిన ఆదేశాలను ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి నాయకత్వంలో అమలు తదితర అంశాలను చైర్మన్‌కు వివరించారు.

ద్విచక్రవాహనం చోరీ

జమ్మికుంట(హుజూరాబాద్): గుర్తు తెలియని వ్యక్తులు బైక్ చోరీ చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. జమ్మికుంట మున్సిపల్ పరిధి కొత్తపల్లికి చెందిన కొంజుల శశికుమార్ తన ఇంటి ఎదుట రాత్రి బైక్ నిలిపాడు. ఉదయం చూసే సరికి బైక్ కనిపించలేదు. మంగళవారం బాధితుడు ఫిర్యాదుచేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.